# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు.
- రాష్ట్రంలోని అన్ని విద్యాలయాల్లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- పదహారవ ఆర్థిక సంఘం ఈరోజు తిరుపతిలో పర్యటిస్తోంది.
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి స్థానం లభించింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

=========================

రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి కొరత ఎక్కడా తలెత్తరాదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, ఇసుక, ఎంఎస్ఎంఈ సర్వే, స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఈరోజు ఆయన దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తాగునీటికి నిధుల కొరత లేదని, ఎక్కడ సమస్య తలెత్తినా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. “పీఎం సూర్య ఘర్ పథకం” కింద సౌర విద్యుత్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని తెలిపారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఇసుక రవాణాపై నిఘా పెట్టాలన్నారు. జిల్లాల ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా వంటి కనీస సదుపాయాలపై జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మన మిత్ర, శక్తి యాప్ లపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

=========================

యువత క్షణికావేశంలో తమ బంగారు భవిష్యత్ ను కోల్పోతున్నారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈరోజు విశాఖలో 'మహిళా రక్షణకు కలసికట్టుగా' అనే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ.. పోక్సో కేసుల్లో 60 శాతం మంది నిందితులు 18 సంవత్సరాల వారేనని తెలిపారు. రాష్ట్రంలో అన్ని విద్యాలయాల్లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వీయ క్రమశిక్షణ ఒక సబ్జెక్ట్‌గా పాఠ్యాంశాల్లో చేర్చుతామని మంత్రి వివరించారు. భవిష్యత్ కోసం యువత ఆలోచన చేయాలని, స్వీయ నియంత్రణ అందరూ అలవాటు చేసుకోవాలని వంగలపూడి అనిత సూచిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

=======================

16వ ఆర్థిక సంఘం ఈరోజు తిరుపతిలో పర్యటిస్తోంది. తిరుపతి జిల్లా తూకివాకంలోని మునిసిపల్ కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిక సంఘం పేర్కొంది. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని ఆర్థిక సంఘం సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితరులు పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ పనితీరుని నగర పాలక సంస్థ అధికారులు ఈ సందర్భంగా వారికి వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్తను నిర్వహణ చేస్తారని, ఇందులో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తామని తెలిపారు. తడి చెత్త నిర్వహణ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తామని, ఇక మార్కెట్ నుండి వెలువడే వ్యర్థాలు, హోటల్స్ నుండి సేకరించిన వ్యర్థాలను నిర్వహణ చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నామని తెలిపారు.

=======================

వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి స్థానం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా తమ రంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులను వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎంపిక చేస్తుంటుంది. ఈసారి భారత్ నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. దీనిపై కేంద్రమంత్రి స్పందిస్తూ... వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా 'యంగ్ గ్లోబల్ లీడర్'గా ఎంపిక కావడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమైన, ప్రభావితమైన నిర్ణయాలు తీసుకునే స్థానంలో భారత యువత ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. నిజాయితీ, నూతన ఆలోచనలతో ప్రజలకు సేవ చేయాలని ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడుకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు దేశానికి, ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణమన్నారు. ప్రజాసేవలో రామ్మోహన్ నాయుడు అంకితభావం.. యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు.

=======================

షెడ్యూల్ కులాల వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఆర్డినెన్స్ జారీ చేసింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఇందుకు సంబంధించిన గెజిట్‌ను న్యాయశాఖ జారీ చేసింది. ఈమేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి ఉత్తర్వులిచ్చారు. ఇటీవల ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

విరామం

=======================

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఈరోజు గుంటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పాల్గొన్నారు. పిల్లలకు గ్యాస్ ప్రమాదాలు నివారించటం, పాఠశాలల్లో అగ్నిప్రమాదాలు జరిగినపుడు క్షేమంగా బయటపడటం వంటి అంశాలపై అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ... ఎక్కడ అగ్ని రాజుకున్న కూడా దాని నుండి గాలిని దూరం చేయటం ద్వారా ఆపేయవచ్చని, ఈ చిన్న సూత్రాన్ని ప్రజలతో పాటు పిల్లలకు కూడా నేర్పితే ఎన్నో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే అన్నమయ్య జిల్లా రాయచోటిలో అగ్ని

ప్రమాదాలపై  ఓ కళాశాలలో నిర్వహించిన  మాక్ డ్రిల్ అవగాహనా కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

========================

పేదవాళ్ల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో  నిర్మించనున్న అన్న క్యాంటీన్ నూతన భవనానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆకలితో ఉన్న ప్రతీ పేదవానికి ఆహారం అందించాలనేది కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. టెక్కలిలో అన్న క్యాంటీన్‌ను మోడల్ క్యాంటీన్‌గా తీర్చిదిద్దుతామని, నాణ్యతతో కూడిన  ఆహారం అందిస్తామని మంత్రి తెలిపారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైన వానిలంక గ్రామంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఏర్పాటు చేసిన డిజిటల్ ట్రైనింగ్ సెంటర్ ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. “పీఎం విశ్వకర్మ యోజన” పథకం ద్వారా ఇప్పటివరకు 1,600 మందికి శిక్షణ అందించారు. వలలు తయారు చేయడం, ఎలక్ట్రికల్ వైరింగ్, మోటార్ వైండింగ్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. అనేక మందికి ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందిన ఒక విద్యార్థి ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 23 సెకన్లు)

========================

రాష్ట్రంలో ఆలయాల పవిత్రతను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని  దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈరోజు నెల్లూరులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... తిరుపతిలోని ఎస్వీ గోశాలను పలువురు ప్రజాప్రతినిధులు పరిశీలించారని, అక్కడ ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు.

========================

భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా ఆయనకు మంత్రి  అంజలి ఘటించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్  విద్యారంగం అభివృద్ధికి కృషి చేసిన దార్శనికుడని మంత్రి పేర్కొన్నారు. భారతదేశ మొదటి ఉప రాష్ట్రపతిగానూ, రెండవ రాష్ట్రపతిగా ఆయన దేశానికి ఎనలేని సేవలు చేశారని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

========================

తమిళనాడు గల్ఫ్ ఆఫ్ మున్నార్ వరకు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదేవిధంగా రాబోయే మూడు రోజుల పాటు వాతావరణ సమాచారాన్ని వాతావరణకేంద్ర అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

==========================

==========================